నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 14 మార్చి 2025 | MAHABUBNAGAR NARAYANPET

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదినం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ హాల్‌లో శాసన, మండలి సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీలు వాణీదేవి, గోరటి వెంకన్న, నవీన్‌కుమార్‌రెడ్డి కవితమ్మకు పుష్పగుచ్ఛం అందజేసి విషెస్ తెలియజేశారు.

సప్తవర్ణ వేడుక

ప్రకృతిలోని అందాలన్నీ ఆవిష్కరించే వసంత రుతువు ప్రవేశించిన తర్వాత నిర్వహించే తొలి పండుగ హోలీ. ఇంద్ర ధనస్సులోని రంగులన్నీ ఒకే చోట కుప్ప పోసినట్లు అందంగా.. ఆహ్లాదంగా.. ఈ రంగోళిని శుక్రవారం ఆనందంగా జరుపుకోనున్నారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా కాలనీలు, రోడ్లపై కేరింతలు కొడుతూ.. ఆటపాటలతో రంగులతో హోరెత్తించనున్నారు.

- నేడు రంగుల కేళీ.. హోలీ
- సిద్ధమైన ఉమ్మడి జిల్లావాసులు
- రసాయన రంగులు వద్దు.. సహజ రంగులే మేలంటున్న వైద్యులు

సాసర్లు ఖాళీ!

- నీళ్లు లేని తొట్లు, కుంటలు, చెలిమలు
- ఎండలు ముదిరినా పట్టించుకోని అటవీశాఖ సిబ్బంది
- దాహార్తితో వన్యప్రాణులు అడవి దాటే ప్రమాదం

కొల్లాపూర్, మార్చి 13 : నల్లమల అభయారణ్యంలో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు అతి కీలకమైన కొల్లాపూర్ రేంజ్ పరిధిలో అటవీశాఖ అధికారులు సాసర్లు ఏర్పాటు చేశారు. కానీ సాసర్లల్లో నీటిని నింపక వన్యప్రాణులు దాహార్తికి అడవిని దాటే ప్రమాదమున్నది. మార్చి ఆరంభంలోనే 39డిగ్రీల ఎండలు కొడుతున్నాయి. ఇప్పటికే అడవిలో కుంటలు, వాగుల్లో నీటి చెలిమలు ఆవిరయిపోయి ఉంటాయి. గతంలో కృష్ణానది తీరం వెంట దాహం తీర్చుకునేం దుకు వచ్చిన పెద్దపులులను సమీప గ్రామాల ప్రజలు జంకుతే.. దాహం తీర్చుకునేందుకు వచ్చిన అడవి గొర్రెలు, దుప్పిలు వేటాగాళ్ల ఉచ్చులో చిక్కుకున్న ఘటనలు నెల కొన్నాయి. మళ్లీ అలాంటి ఘటనలు పునఃరావృతం కాకుండా ఉండాలంటే అడవిలో జంతువులు దాహం తీర్చుకునేం దుకు ఏర్పాటు చేసిన సాసర్లు, కుంటలను నీటితో నింపాల్సిన అవసరం ఉన్నది.

ఎండలు ముదిరినా..

కొల్లాపూర్ రేంజ్ పరిధిలో 36,872 హెక్టార్లలో దట్టమైన అడవి విస్తరించి ఉన్నది. గత లెక్కల ప్రకారం 13 పెద్దపులులతోపాటు చిరుత పులులు, వందలాది శాఖాహార జంతువులున్నాయి. ఎండకాలంలో దాహార్తిని తీర్చుకునేందుకు అడవి దాటి బయటకు రాకుండా ఉండేందుకు అటవీశాఖ పదుల సంఖ్యలో సాసర్లతో పాటు కృత్రిమ కుంటలు, బోర్లను ఏర్పాటు చేసిం ది. కానీ మార్చిలో ఎండలు ముదిరినా సాసర్లలో నీళ్ల నింపలేదు. దాహం అవుతోందని అడగలేని ముగజీవాలపై సంబంధిత శాఖ నిర్లక్ష్యం నీళ్లు లేని సాసర్ తొట్లతో స్పష్టమవుతున్నది.

సాసర్లను నీటితో నింపాలి

తమ గ్రామంలో నల్లమల, కృష్ణానది తీరానికి మధ్య లో ఉంటుంది. మా గ్రామానికి వెళ్లే దారిలో ఉండే సాసర్లలో నీళ్లు లేవు. కొన్నినెలల కిందట మా గ్రామానికి సమీపంలో పెద్దపులి మృతి చెందింది. దీంతో మా గ్రామ ప్రజలు భయాందోళన గురవుతున్నారు. దాహం కోసం వచ్చి ఎక్కడ దాడి చేస్తాయోనని భయపడుతున్నారు. – **భరత్, అమరగిరి**

ముగజీవాల దాహార్తి తీర్చాలి

నల్లమల అభయారణ్యం మన ప్రాంతానికి మా ణిక్యం లాంటింది. అందులోని అడవి జంతువులను కాపాడుకోవాల్సి బాధ్యత అందరిపై ఉంది. సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి అడవి జంతువులకు దాహార్తి తీర్చేం దుకు ఏర్పాట్లు చేయాలి. – **రమణ, జానవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు**

అమరగిరి సమీపంలోని నల్లమలలో నీళ్లులేని సాసర్

కొనసాగుతున్న డీవాటరింగ్

- ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో 20 రోజులు గడిచినా లభించని ఏడుగురి ఆచూకీ
- డీ-1, డీ-2 ప్రదేశాల్లో మృతదేహాల కోసం తవ్వకాలు
- ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్న ఉన్నతాధికారులు

అచ్చంపేట, మార్చి 13 : దోమలపెంట ఎస్ఎల్‌బీసీ సొరంగంలో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతున్నది. టన్నెల్‌లో చిక్కుకున్న ఏడుగురి జాడ కోసం అధికార యంత్రాంగం మానవ ప్రయత్నంతో పాటు యంత్రాల సహాయంతో సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ఘటన జరిగి 20 రోజులు గడిచినా మిగిలిన ఏడుగురి ఆచూకీ లభ్యం కాలేదు. కేంద్ర, రాష్ట్ర విభాగాలకు చెందిన 12సంస్థలు 4 షిఫ్టులుగా టన్నెల్‌లోకి వెళ్లి రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. కేరళ క్యాడవర్ డాగ్స్, జీపీఆర్ ర్యాడర్ గుర్తించిన డీ1, డీ2 ప్రదేశాల్లో గత కొన్ని రోజులుగా తవ్వకాలు జరుపుతున్నారు. ఆ ప్రదేశాల్లో దుర్వాసన వస్తుందని కానీ మృతదేహాల ఆచూకీ మాత్రం లభించలేదు. అన్వీ రోబోటిక్స్ సంస్థకు చెందిన అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబోను ప్రమాద ప్రదేశానికి పంపించారు. టన్నెల్ లోపల భారీగా పేరుకు పోయిన శిథిలాలు, మట్టి, బురదను కన్వేయర్ బెల్ట్ ద్వారా బయటికి పంపిస్తున్నారు. భారీగా ఉబికి వస్తున్న ఊట నీటిని డీవాటరింగ్ ద్వారా బయటికి పంపిస్తున్నారు. దక్షిణమధ్య రైల్వేకు చెందిన ప్లాస్మా కట్టర్స్, థర్మల్ కట్టర్స్ బృందాలు టన్నెల్ బోరింగ్ మిషన్ ప్లాట్‌ఫాంను కత్తిరించి పరికరాలను లోకో ట్రైన్ ద్వారా బయటికి పంపిస్తున్నారు. డీ1,డీ2 ప్రాంతాల్లో సింగరేణి, ర్యాట్ మైనర్స్ బృందాలు నిరంతరాయంగా పని చేస్తున్నాయి. సహాయక చర్యలను డిజాస్టర్ అండ్ మేనేజ్‌మెంట్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ ఉన్న తాధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు నిర్వహించి తదుపరి చర్యలు తీసుకుంటున్నారు.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో మోటర్ల ద్వారా డీవాటరింగ్ చేస్తున్న రెస్క్యూ సిబ్బంది

అంబరాన్నంటిన సంబురం

- ఘనంగా ఎమ్మెల్సీ కవిత బర్త్‌డే వేడుకలు
- కేక్ కట్ చేసి పంపిణీ చేసిన నాయకులు
- పీయూలో మొక్కలు నాటిన విద్యార్థులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్/అయిజ, మార్చి 13 : జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఘనంగా జరిగాయి. గురువారం జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పండ్లు, బ్రెడ్డును బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పల్లయ్య మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత కవితదే అన్నారు. బతుకమ్మ పండుగను గ్రామ స్థాయి నుంచి దేశ విదేశాల్లోని మహిళలు సైతం నిర్వహించేలా చేశారన్నారు. పోరాటంలో రాణీరుద్రమ.. వీరత్వంలో ఝాన్సీల క్షీణాయి.. ఔదార్యంలో మదర్ థెరిస్సా.. నేర్పించడంలో సావిత్రి బాయిపూలే, నమ్ముకున్న వారికి అండగా ఉంటూ బడుగు, బలహీన వర్గాలకు భరోసానిచ్చే తెలంగాణ బతుకమ్మ, కార్యకర్తలకు ఆత్మ బంధువుగా కవిత నిలుస్తుందన్నారు.

పీయూలో మొక్కలు నాటిన విద్యార్థులు

పాలమూరు యూనివర్సిటీలో తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితమ్మ జన్మదిన వేడుకలు బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో యూనివర్సిటీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌వీ పీయూ కన్వీనర్ గడ్డం భరత్ బాబు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలకు అనుగుణంగా.. ప్రజానికాన్ని ఏకధాటికి తెచ్చేందుకు కవితక్క బతుకమ్మ వేడుకలను పరిచయం చేసి ఊరువాడలకు ఉద్యమ నినాదాన్ని నింపారన్నారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి పార్లమెంట్‌లో నిత్యం తన గళాన్ని వినిపిస్తూ.. చట్టసభల్లో మహిళలకు 31శాతం రిజర్వేషన్ల బిల్లుపై విస్తృతంగా పోరాడి ఉత్తమ పార్లమెంట్ అవార్డు గ్రహీత మన కవితక్క అని కొనియాడారు. తెలంగాణలో బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాల్లో 46శాతం రిజర్వేషన్లు పెంచాలని సుదీర్ఘ ఉద్యమాలతో ప్రభుత్వానికి బీసీల డిమాండ్లను గుర్తు చేస్తూ ముందుకు సాగారన్నారు. ప్రభుత్వం విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాల్లో వేర్వేరుగా అసెంబ్లీలో మూడు బిల్లులను పెట్టేవరకు విశ్రమించకుండా ప్రభుత్వం మెడలు వంచి కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయించిన ఘనత కవితమ్మకు దక్కిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ నాయకులు ఆంజనేయులు, తిరుమలేశ్, నరేశ్, మల్లేశ్, లక్ష్మణ్, మహేశ్, నర్సింహులు, జ్యోతి, ప్రేమలత, ఉమామహేశ్వరి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు యూనివర్సిటీలో విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్‌వీ నాయకులు

తడారుతోంది!

కనిష్ఠ నీటిమట్టంతో సంగంబండ రిజర్వాయర్

- వట్టిపోతున్న కాల్వలు.. ఎండుతున్న పంటలు
- నీళ్లులేక అడుగంటిన సంగంబండ రిజర్వాయర్
- గణనీయంగా తగ్గిన నీటిమట్టం.. రైతన్న ఆందోళన
- పంటలను కాపాడుకునేందుకు నానా పాట్లు
- కాల్వలకు నీరందించాలని అన్నదాతల విజ్ఞప్తి

కాల్వలకు సాగునీరు అందించాలి

తాళంకేరి గ్రామం మొత్తం సంగంబండ నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ రైట్ హైలెవెల్ కాల్వను నమ్ముకొని వరి పంటలు సాగు చేస్తున్నారు. కొన్నిరోజుల నుంచి కానాల్‌లో చుక్క నీరు రాకపోవడంతో చిరు పొట్టదశలో ఉన్న పంటపొలాలు ఎండిపోయే స్థితికి చేరుకుంటున్నాయి. చివరి క్షణంలో పంట చేతికొస్తుందని, ఆశలు నిరాశలు చేయకుండా సంబంధిత అధికారులు కాల్వల ద్వారా నీరందించేలా చర్యలు తీసుకోవాలి. **- నర్సింహులు, తాళంకేరి, మాగనూరు మండలం**

19 వేల ఎకరాల్లో పంటలు ప్రశ్నార్థకం

మాగనూరు, మార్చి 13 : మాగనూరు మండలం సంగంబండ రిజర్వాయర్ ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం కనిష్ఠానికి పడిపోవడంతో ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది. పాటుకాల్వలు వట్టిపోవడంతో పంటలు ఎండుముఖం పడుతున్నాయని ఆయకట్టు రైతులు ఆయోమయానికి గురవుతున్నారు. ప్రస్తుతం ఆయకట్టులో వరి పంటలు చిరు పొట్టదశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే పంటలు ఎండుతుండడం మరో పక్క అయితే ఎండలు తీవ్రత కూడా పెరుగుతుండడంతో రైతులను మరింత కలవరపెడుతున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 364 అడుగులు కాగా.. ప్రస్తుతం నాలుగు అడుగుల కనిష్ఠానికి పడిపోయింది. ప్రాజెక్టు కింద ప్రస్తుతం ఎండాకాలంలో 19వేల ఎకరాలకు పైగానే వరిసాగు చేశారు. వానకాలంలో అయితే 58వేల ఎకరాల సాగు చేస్తారు. ప్రస్తుతం ఎండాకాలం ప్రారంభంలోనే ఆయకట్టు చివరకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. రానున్న మరికొద్ది రోజుల్లో ప్రాజెక్టు నీటిమట్టం డెడ్ స్టోరేజ్‌కి చేరనుండడంతో అన్నదాతలు పంటలు చేతికి అందుతాయో లేదోనని ఆందోళన చెందుతున్నారు. అయితే సంగంబండ రిజర్వాయర్ రైట్ హైలెవెల్ కెనాల్ కాల్వకు పూర్తిస్థాయిలో సాగునీరు అందక వట్టి పోతున్నది. కాల్వలు వట్టి పోవడంతో పంటలు కూడా ఎండుముఖం పడుతున్నాయని, ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు చొరవ చూపి సంగంబండ నర్సిరెడ్డి రైట్ హైలెవెల్, లోలెవెల్ కెనాల్‌కు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

నేరడుగంటొడ్డి సమీపంలో వట్టిపోయిన సంగంబండ రైట్ హైలెవెల్ కెనాల్

ఎండిన పంటలు.. పశువుల పాలు

పాన్‌గల్, మార్చి 13: పొలాలకు సాగునీరు అందక పంటలు ఎండుతున్నాయి. మరికొన్నిచోట్ల పంటలను కాపాడుకునేందుకు రైతులు నానాపాట్లు పడుతుండగా.. కొందరు పశువులకు మేతగా వదిలేస్తున్నారు. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం అన్నారం తండాలో మహిళా రైతు బొజ్జమ్మ తనకున్న రెండు ఎకరాల్లో ఒక ఎకరం వరి, మరొక ఎకరం వేరుశనగ పంటను సాగు చేసింది. యాసంగిలో బోరు వట్టి పోవడంతో సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. నీటికోసం ఎంత ప్రయత్నించినా ప్రయోజనం చేకూరలేదు. వరి, వేరుశనగ పంటలకు సరిపడా నీరందక ఇటీవల ఎండిపోయాయి చేసేదిలేక పశువుల మేతకు వదిలేసింది. పంట చేతికొస్తదనుకుంటే ఎండిపోయిందని, పొలంలో పశువులు, గొర్రెలను

పశువులు మేసిన పొలంలో మహిళా రైతు బొజ్జమ్మ

మేపుతున్నారు. పెట్టుబడికి తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడంలేదని వాపోయింది. ప్రభుత్వం సాయం అందిచినా బాగుండేని పేర్కొన్నది.

సరపడా సాగునీరు అందించాలి

- జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్
- క్షేత్రస్థాయిలో ఎండిపోతున్న పంటల పరిశీలన

కాల్వకు వేసిన మోటర్లు పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

గద్వాల, మార్చి 13: సాగునీటి సరఫరా సమర్థవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం కేటిదొడ్డి మండలంలోని కొండాపురంలో నీటి కొరతతో ఎండిపోతున్న పంటలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడి వారి పొలాల్లో పర్యటించి పంటల పరిస్థితిని తెలుసుకున్నారు. వరి పంటలు నీటి కొరత కారణంగా తీవ్రంగా ప్రభావితమవుతున్నట్లు గుర్తించారు. ర్యాలంపాడ్ ప్రధాన ఎడమ కాల్వ 104 ప్యాకేజీ పరిధిలోని కొండాపురం, గువ్వలదిన్నె, మైలగడ్డ వద్ద కాల్వ ప్రవాహాన్ని, నీటిసరఫరా పరిస్థితిని కలెక్టర్ పరిశీలించారు. కాల్వలో నీటి విడుదల, పంపిణీ విధానం, ఆయకట్టు పరిధిలోని ప్రాంతాలకు నీరు చేరుతున్న తీరును తెలుసుకునేందుకు అక్కడి పంపింగ్ స్టేషన్లు, పంపిణీ వ్యవస్థను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడి రైతుల అభ్యర్థన మేరకు తక్షణమే సాగునీటిని కాల్వల్లోకి విడుదల చేయాలని నీటి పారుదలశాఖ అధికారులను ఆదేశించారు. కాల్వ ద్వారా సరఫరా అవుతున్న నీరు ఆయకట్టు చివరి ప్రాంతాలకు అందేలా సమతుల్యతను పాటించాలని సూచించారు. కాల్వ ద్వారా నీరు ఆయకట్టు చివరి ప్రాంతాలకు చేరకుండా ఎగువ ప్రాంతాల్లోని రైతులు మోటర్లు, పంప్‌సెట్లు ఉపయోగించి నీటిని వినియోగిస్తున్న పరిస్థితిని కలెక్టర్ పరిశీలించారు. ఇలా కాకుండా కాల్వల వెంట నీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, రైతుల పంటలను కాపాడేందుకు అన్ని అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తక్షణమే అవసరమైన చర్యలు తీసుకొని సాగునీటి సరఫరా పద్ధతులు మెరుగు పరిచేందుకు తగిన చర్యలు చేపడుతామని కలెక్టర్ రైతులకు భరోసా కల్పించారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఈఈ రహీముద్దీన్, అధికారులు సక్రియా నాయక్, సంగీతలక్ష్మి, రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.